# రమ్యస్మృతి

- ఆకునూరి మురళీకృష్ణ

చనిపోయిన తాతయ్య కోసం ఆరోజు కనీసం రెండు కన్నీటిబొట్లు కూడా ఎందుకు కార్చలేకపోయానో..తల్చుకుంటే ఇప్పటికీ నామీద నాకే కోపంగా వుంటుంది.

భాధతో కాకపోయినా, భరించలేని వేదనతో కాకపోయినా, జీవితం అంటే ఏమిటో నాకు తన కళ్ళతో చూపించినందుకు కృతజ్ఞతతోనైనా ఆయన భౌతికకాయం ముందు నిలబడి రెండు కన్నీటి బిందువులు వదలడం నా కనీస ధర్మం.

ఆ ఒక్కరోజు నా మనసు కరుడు కట్టిన రాయిలా వుండిపోయినందుకు ప్రతిఫలంగా జీవితంలో ఆ సంఘటన గుర్తొచ్చిన ప్రతిసారీ గుండెనెవరో రెండు చేతుల్లో పట్టుకుని మెలితిప్పుతున్న బాధ అనుభవిస్తూ వుంటాను.

ఆరోజు నాకింకా గుర్తే...

తాతయ్య చనిపోయిన రోజు!

నాకు నిండా పధ్నాలుగేళ్ళు వుంటాయేమో?

అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లి పట్నంలో వుండేవారు. నాన్నకి అక్కడ ఉద్యోగం. నన్ను మాత్రం తాతయ్య బలవంతం మీద నాన్న పల్లెటూళ్ళోనే వుంచేసారు.

నన్ను ఆక్కడ వుంచడం నాన్నకీ అమ్మకీ కూడా పెద్దగా ఇష్టం లేదు.

''ఈ పల్లెటూళ్ళో చదువులవీ సరిగ్గా వుండవు. సెలవుల్లో వస్తూ వుంటాడులే నాన్నా'' తాతయ్య నన్ను అక్కడ వుంచెయ్యమని అన్నరోజు నాన్న ఆయనకి నచ్చ చెప్పాలని ప్రయత్నం చేస్తూ అన్నాడు.

దానికి తాతయ్య నాన్నమీద అంతెత్తున లేచాడు.

''ఏమిట్రా పెద్ద మాట్లాడుతున్నావు? మీరంతా పట్నాల్లో చదువుకునే ఇంత వారయ్యారా? నాలుగు రోజులు పట్నంలో వుండి వచ్చేసరికి మీకీ పల్లెటూళ్ళు కాకుండా పోయాయా? ఇక్కడేమీ లేదనేస్తావా?'' అన్నాడు కోపంగా.

''అది కాదు నాన్నా...ఆరోజులు వేరు!'' అంటూ నాన్న ఆయనకి నచ్చచెప్పాలని చూసాడు.

ఆయన వినిపించుకోలేదు.

''నీకు వీడి చదువు గురించేగా బెంగ? వాడి చదువు గురించీ వాడి భవిష్యత్ గురించీ నీకు నేను హామీ ఇస్తున్నాను. వాడు తప్పకుండా నీకంటే ప్రయోజకుడే అవుతాడు..చాలా?'' అన్నాడు.

నాన్న ఇంకేమి మాట్లాడలేకపోయాడు.

నాన్నమ్మ అమ్మకి చాటుకుండా నచ్చ చెప్పింది.

''వాడిని నేను కంటికి రెప్పలా చూసుకుంటాను. మేము కూడా పెద్దవాళ్ళం...ఒక్కళ్ళమే వుండలేం.. .వాడు మాకు సాయంగా వుంటాడు'' అని.

అలా బలవంతంగా అమ్మ, నాన్నలని వదిలి ఆ పల్లెటూళ్ళో వుండి పోవాల్సి వచ్చింది నాకు.

అది నాకు తాతయ్య మీదున్న మొదటి కోపం.

ఆయన మూలంగా నా బాల్యం అంతా అమ్మా నాన్నలకి దూరంగా ఆ పల్లెటూళ్ళో మట్టిగోడల మధ్యా, ఊరి చివర వున్న వీధి బళ్ళోనూ, చెరువు గట్టున పిల్లలతో బిల్లంగోటి ఆటలతోనూ గడిచింది.

మధ్య మధ్యలో సెలవలకి అమ్మ, నాన్న, తమ్ముడు చెల్లాయ్ వచ్చేవారు.

నన్ను మాత్రంపట్నం పంపడానికి తాతయ్య పెద్దగా ఇష్టపడే వాడు కాదు!

సెలవల్లో కూడా శాస్త్రులు గారి దగ్గర భగవద్గీత నేర్పించడం, అయ్యవార్ల దగ్గిర లెక్కల ప్రైవేట్లు అంటూ ఏదో కారణంగా అక్కడే వుంచేసే వాడు.

కొత్తలో బాధగా అనిపించినా, తర్వాత తర్వాత అది కూడా నెమ్మదిగా అలవాటైపోయింది. అమ్మ నాన్నల మీద బెంగ పెద్దగా వుండేది కాదు.

ఊర్లో స్నేహితులు బాగా దగ్గిరయ్యారు.

నాన్నమ్మ ఎంత ప్రేమగా చూసేది.

ఊరి చివరి మావిడి తోపులో స్నేహితులతో ఆటలు, వేసవికాలం కాలవలో ఈత, కార్తీకమాసంలో నానమ్మతో కలిసి గుళ్ళో వినే పురాణాలు, తాతయ్య చెప్పే స్వాతంత్ర్యోద్యమ కథలూ ఎంతో ఉత్సాహాన్నిచ్చేవి.

అంతా బాగానే వుండేది కానీ తాతయ్య క్రమశిక్షణే భరించలేక పోయేవాడిని.

ఉదయం ఐదున్నరకల్లా లేవాలి.

ఎంత చలికాలమైనా ఆయనతో పాటూ కాలవలో చన్నీటి స్నానం తప్పనిసరి. ఉదయం పూట చన్నీటి స్నానం ఆరోగ్యానికి మంచిదట.

పరీక్షల రోజుల్లో అయితే తెల్లవారు ఝామున లేపి కూర్చోపెట్టేవాడు చదువుకోవడానికి. నాతోపాటూ ఆయన కూడా లేచి కూర్చునే వాడు.

తెల్లవారు ఝాము నాకు మంచి నిద్ర టైము.

ఆ సమయంలో లేవడం...అందులో చదువుగురించి అంటే నాకు చచ్చేంత పనయ్యేది.

లేవకపోతే ఊరుకునే వాడు కాదాయన.

ఆ సమయంలో మైండ్ ఫ్రెష్‌గా వుంటుందట. చదివింది బుర్రకెక్కుతుంది అనేవాడు.

పక్కనే ఒక గిన్నెతో చన్నీళ్ళు పెట్టుకుని నిద్రనాపుకోలేక నేను కునికిపాట్లు పడుతూ వుంటే ముఖం మీద నీళ్ళు చల్లి నిద్ర పోగొట్టేవాడు.

పరీక్షల నెల రోజులూ ఇదంతా నాకు నరకంలా వుండేది.

తాతయ్యని తిట్టుకోని రోజు వుండేది కాదు.

ఆ వయస్సులో రాత్రిళ్ళు సరిగ్గా నిద్ర లేని కారణంగా ఆయన ఆరోగ్యం కూడా పాడయ్యేది. అయినా లెక్క చేసేవాడు కాదు.

ఏ పాఠమైనా స్కూల్లో మాస్టారు చెబితే ఆయనకి తృప్తిగా వుండేది కాదు..

రోజూ రాత్రి పూట భోజనం అయ్యాక పుస్తకాలు పట్టుకుని ఆయన ముందు కూర్చోవాలి.

పుస్తకంలో ప్రతి పాఠం ఆయన చదివి అంతా విడమర్చి చెప్పేవాడు ఒక గంట. తర్వాత చెప్పినదంతా మళ్ళీ నా చేత చెప్పించే వాడు.

ఎక్కడైనా తప్పు చెబితే రూళ్ళ కర్రతో అరచేతులు కందిపోయేలా కొట్టేవాడు.

ఆ దెబ్బలకి భయపడే చెప్పేది శ్రద్ధగా వినిడం అలవాటు చేసుకున్నాను.

ఆ అలవాటు ప్రభావమేనేమో? ఇప్పటికీ నేను ఏ విషయాన్నైనా ఒకసారి వింటే లేదా చూస్తే చాలు... జీవితంలో మళ్ళీ దాన్ని మర్చిపోలేను.

దాన్నే 'ఏక సంథాగ్రాహ్యం' అంటారుట.. తాతయ్య చెప్పేవాడు.

దానిని అలవర్చుకోవాలనే వాడు.

దాని మాట ఏమోకానీ, రూళ్ళకర్ర దెబ్బలు తినీ తినీ నా అరచేతులు బండబారిపోయాయి.

ఆయన మీద కసి మరింత పెరిగిపోయేది.

ఎప్పుడైనా ఆయన నిద్రపోతున్నప్పుడు ఆ రూళ్ళకర్రతోనే ఆయన బుర్ర బద్దలుకొట్టి చంపెయ్యాలన్నంత కసిగా వుండేది.

చదువు విషయంలో ఆయన చాలా ఖచ్చితంగా వుండేవాడు.

ఒకసారి పదహారో ఎక్కం అప్పచెప్పడంలో ఒకే ఒక తప్పు చెప్పానని మిట్టమధ్యాహ్నం అన్నం కూడా మానిపించి ఎండలో నిలబెట్టి ఆ ఎక్కాన్ని వెనుక నుంచీ ముందు నుంచీ వందసార్లు చదివించాడు.

ఇప్పటికీ నిద్దట్లో లేపి అడిగినా ఒక్క తప్పు లేకుండా ఆ పదహారో ఎక్కాన్ని గడగడా అప్ప చెప్పగలను నేను.

అంతలా చదివించే వాడు కనుకే ఆ స్కూల్లో ఎప్పుడూ ఎవరికీ రానన్ని మార్కులు నాకు వచ్చేవి.

మాష్టార్లందరూ ''మీవాడు అసాధ్యుడండీ'' అని పొగుడుతుంటే గర్వంగా మీసం దువ్వుకునేవాడు తాతయ్య.

నాకు చాలా కోపంగా వుండేది..

ఆయన గొప్ప కోసం నన్నింతలా ఇబ్బంది పెడుతున్నందుకు!

ఆయన నిరంకుశత్వం అక్కడితో ఆగిపోలేదు, నా జీవితంలో ప్రతి విషయంలోను ఆయన అధికారం చెలాయించేవాడు.

ఊళ్ళో పిల్లలతో కబాడీ ఆడినా...కాలవలో ఈతకొట్టినా..గుళ్ళో శాస్త్రులుగారి దగ్గర భగవద్గీత నేర్చుకున్నా అంతా ఆయన ఇష్టం ప్రకారం, ఆయన చెప్పిన సమయాల్లోనే చెయ్యాలి.

ఇంటికి రావడం చెప్పిన సమయానికి ఒక్క నిముషం ఆలస్యం అయినా బ్రతకనిచ్చేవాడు కాదు.

''జీవితంలో క్రమశిక్షణ లేకుండా పోతావు'' అంటూ తిట్టేవాడు.

ఆయన బాధ భరించలేకే ఏపనైనా టైము ప్రకారం చెయ్యడం ఆ వయసులోనే అలవాటు చేసుకున్నాను.

సెలవల్లో తనతోపాటూ పొలానికి తీసుకు వెళ్ళేవాడు. తీసుకెళ్ళి ఊరుకునేవాడు కాదు.

అక్కడ జట్టు కూలీలతో సమంగా నాతోనూ పొలం పని చేయించేవాడు.

దుక్కి దున్నడం, నారుపొయ్యడం, నీరు పెట్టడం దగ్గిర్నుంచీ కోత కొయ్యడం కుప్ప వెయ్యడం వరకూ అన్నింటి గురించీ చెప్పడమే కాకుండా అన్నీ నాచేత కూడా చేయించేవాడు.


ఇవన్నీ నాచేత ఎందుకు చేయిస్తున్నావని అడిగితే

''నువ్వు తినే అన్నం గింజలు ఎంత కష్టపడితే వస్తాయో నీకు తెలియొద్దా?'' అనేవాడు.

పొలంపనేకాదు...పాలేరు ఎప్పుడైనా రాకపోతే గేదెలకి గడ్డివెయ్యడం, పాకని శుభ్రం చెయ్యడం లాంటి పనులు కూడా నాచేతే చేయించేవాడు.

అలాంటప్పుడే తాతయ్యని చంపెయ్యాలన్నంత కసిగా వుండేది.

''శ్రద్ధగా చదువుకుంటే సమాజంలో ఉన్నతమైన స్థానంలో వుంటావు. లేకపోతే ఇలాంటి పనులే చేసుకుని బ్రతకాల్సి వస్తుందని చెప్పడానికే ఇదంతా నీచేత చేయిస్తున్నాను. ఏది కావాలో నువ్వే తేల్చుకో'' అనేవాడు ఆయన నా కోపాన్ని గమనించి.



నేను నా బాధలన్నీ నానమ్మ దగ్గిర చెప్పుకుని ఏడ్చేవాడ్ని.

ఆమెకి కూడా ఏమ నాలో తెలిసేది కాదేమో...

''తాతయ్య చెప్పినట్లు విను..జీవితంలో పైకొస్తావు'' అనేది.

ఆయన కర్కశత్వాన్ని మరచిపోయేంతలా ప్రేమ చూపించేది నానమ్మ.

ఆమె మాటే అమృతంలా వుండేది. అందుకే ఆమె మాట కాదనలేక తాతయ్యని ఎదిరించేవాడ్ని కాదు.

అలాగే తొమ్మిది సుదీర్ఘమైన సంవత్సరాలు గడిచిపోయాయి.

ఈ తొమ్మిదేళ్ళలోనూ తాతయ్యనెదిరించి ధైర్యంగా ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయాను.


ఆయన ధోరణి కూడా ఏమీ మారలేదు.

ఆయన కోసం నన్ను నేనొక మరమనిషిగా మార్చుకున్నాను.

తాతయ్య ఆరోగ్యం బాగా పాడైపోయింది.

అయినా ఆయన నాకు చదువు చెప్పడం, కథలు చెప్పడం మానలేదు. నాతో సమానంగా ఆయనా చదివేవాడు. తిరిగేవాడు.

చనిపోయే ముందు రోజు రాత్రి ఆయన గుండె నొప్పితో చాలా బాధపడ్డాడు. ఆరోజు రాత్రి నన్ను పిలిచి అన్నాడు.




''ఒరేయ్... నీకు నా మీద చాలా కోపంగా వుంది కదూ?''

నేను మాట్లాడలేదు.

''ఇన్నాళ్ళూ నిన్ను చాలా కష్ట పెట్టానురా.. నిజమే. ఎందుకో తెలుసా? కష్టపడినవాడూ, కష్టం విలువ తెలిసిన వాడూ జీవితంలో ఎప్పుడూ చెడిపోడు. నువ్వు ప్రయోజకుడివి కావాలనీ, ఎవ్వరూ ఊహించలేనంత వృద్ధిలోకి రావాలనీ నా కోరిక. అందుకే నిన్ను అంత కష్టపెట్టాను. నేను చూడలేక పోయినా నువ్వు నా కోరిక తీర్చాలి'' గుండె నొప్పితో విలవిల్లాడిపోతూ కూడా ఆయన నాతో మాట్లాడాడు.

అయినా నాకుఆయన మీదేమి జాలి కలగలేదు.

కసి..

డ్వాక్టరు పెదవి విరిచేసేడు.

నాన్నకీ, అత్తయ్యలకీ కబుర్లు వెళ్ళేయి. కానీ వాళ్ళు వచ్చేసరికే అంతా అయిపోయింది.

ఇల్లంతా జనాలు..హడావిడి...

ఊళ్ళో పెద్ద మనుషులంతా వచ్చేరు.

అంతా బాధపడుతున్నారు...ఏడుస్తున్నారు...

నాలో మాత్రం ఏ భావమూ లేదు. చాలా మామూలుగా వున్నాను.

అందరూ నా వాలకాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

''చిన్న పిల్లాడు కదా! షాక్ తిన్నట్లున్నాడు'' అని సరిపెట్టుకున్నారు.

వాళ్ళెవరికీ అసలు కారణం తెలియదు.

★★★

తాతయ్య చనిపోయాక నా నివాసం అమ్మా నాన్నల దగ్గరకి పట్నానికి మారింది.

అక్కడ నన్ను ఇంగ్లీషు మీడియంలో చేర్పిడానికి మొదట కొంచెం భయపడ్డాడు నాన్న. కానీ నేనేం ఇబ్బంది పడలేదు. కేవలం రెండు నెలల్లోనే ఇంగ్లీషు మీడియం విద్యార్థులతో సమంగా పాఠాలు అర్థం చేసుకునే స్థాయికి ఎదిగాను.

అప్పటిదాకా నేను చదివింది తెలుగు మీడియం స్కూల్లోనే అయినా, తాతయ్య నాకు ఇంగ్లీషు బానే నేర్పించాడు. రోజూ లైబ్రరీ నుంచి ఇంగ్లీషు పేపరు తెప్పించి నాతో చదివించేవాడు. రోజుకో గంట ఇంగ్లీషులో మాట్లాడించేవాడు.

అందుకే చాలామంది ఇంగ్లీషు మీడియం పిల్లలకన్నా నాకే ఎక్కువ ఇంగ్లీషు తెలుసు.

ఒక్క ఇంగ్లీష్‌లోనే కాదు..మిగతా సబ్జెక్టులన్నింటిలోనూ అందరికన్నా నేనే ముందుండేవాడిని.

చెప్పింది శ్రద్ధగా వినడం, ఒకసారి చదివితే అర్థం చేసుకోగలగటం, దేనికీ బద్ధకించకపోవడం, మొదలైన లక్షణాల వల్ల పెద్దగా కష్టపడకుండానే టెన్త్‌క్లాసులో స్టేట్ ర్యాంకు వచ్చింది.

''ఆయన మొండితనం వల్ల వీడ్ని పల్లెటూళ్ళోనే వుంచి చదివించాల్సి వచ్చినా బానే వృద్ధిలోకి వస్తున్నాడు'' అన్నాడు నాన్న ఆనందంగా.

అప్పుడు నాకు మొదటిసారి గుర్తొచ్చేడు తాతయ్య..

ఆ వయసులో వచ్చిన స్టేట్ ర్యాంక్ నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తర్వాత నేను జీవితంలో వెనుదిరిగి చూసుకునే అవసరం రాలేదు.

వయసు వస్తున్న కొద్దీ..జ్ఞానం తెలుస్తున్నకొద్దీ..నేను సాధిస్తున్న విజయాలన్నింటికీ కారణం ఆ వయసులో తాతయ్య అలవర్చిన క్రమశిక్షణే అని అర్థం కాసాగింది.

అప్పుడు ఆయన చెప్పిన ఒక్కోమాటా ఒక్కో జీవిత సత్యమై సక్షాత్కరిస్తున్నాయి!

మనిషి జీవితంలో ఎదగాలంటే ఎలాంటి లక్షణాలుండాలో...అలాంటి లక్షణాలు నాకు అలవడేలా చేసాడాయన.

అలాంటి మనిషిని నేనెలా తిట్టుకున్నాను?

నాకోసం ఆరోగ్యం పాడు చేసుకుని ఆయన చనిపోతే కనీసం రెండు కన్నీటి బిందువులు కూడా కార్చలేకపోయాను.

ఆయన మళ్ళీ బ్రతికొస్తే ఒకసారి ఆయనకి మనసారా క్షమార్పణలు చెప్పుకోవాలని వుంది.

★★★

చాలా రోజుల తర్వాత ఆ పల్లెటూళ్ళో పొలం, ఇల్లు, ఏదో ఒక ధరకి అమ్మెయ్యమని నాన్న అన్నప్పుడు వెళ్ళాను అక్కడికి.

చిన్నప్పుడు నేను తిరిగిన వీధులూ, ఈత కొట్టిన కాలవా, నానమ్మతో పురాణాలు విన్న శివాలయం, నేను పనిచేసిన పొలం....ఆ ఇల్లు...

అన్నీ నన్ను పలకరించాయి.

ఊర్లో పెద్దా, పిన్నా, ముసలీ, ముతకా అంతా నన్ను తేరిపార చూసి ''నువ్వు మాధవరావుగారి మనవడివి కదూ?'' అన్నారు.

అవునన్నాను.

''మాధవరావుగారి మనవడొచ్చాడు..'' అంతా చెప్పుకోసాగారు.

నా దగ్గరకొచ్చి ఏదేదో మాట్లాడసాగారు తాతయ్య గురించీ..


ఆరోజుల గురించీ..

అప్పుడొచ్చాయి నా కళ్ళలోకి నీళ్ళు!

సాయంత్రం వరకూ అక్కడ వుండి వచ్చేసాను.

పొలాన్నీ, ఇంటినీ అమ్మలేదు..అపుడపుడు అక్కడికి వచ్చి, 'మాధవరావుగారి మనవడి' గా పిలిపించుకుని, ఆ రమ్యస్మృతులని నెమరు వేసుకునేందుకు వీలుగా!

★



## సాహసం!

వరసగా మూడు చిత్రాలు సూపర్ హిట్ చేసి హాట్రిక్ సాధించిన దర్శకుడు శంకర్ నాలుగో చిత్రం ఫెయిల్ కావడం కాస్త బాధ కలిగించే విషయం. 'జీన్స్' చిత్రం ఊహించినంత విజయాన్ని సాధించకపోవడంతోనో ఏమో ఇప్పుడు బయటి నిర్మాతకు కాకుండా తానే తన తదుపరి చిత్రాన్ని నిర్మించదలచాడు శంకర్. నిర్మాతగా కూడా మారుతున్న శంకర్ ప్రస్తుతం అంతగా డిమాండ్ లేకపోయినా కూడా తన చిత్రానికి ఇళయరాజాని మ్యూజిక్ డైరెక్టర్‌గా నిర్ణయించుకున్నాడు. అంతేకాదు, కెరీర్ అంతగా బాగాలేని స్థితిలో వున్న విజయకాంత్‌ని హీరోగా ఎన్నుకున్నాడు. అటు ఇళయరాజా, ఇటు విజయకాంత్ ఇద్దరికీ ఈ సినిమా ఎంత వరకూ మేలు చేస్తుందో ఏమోగానీ ఇలాంటి కాంబినేషన్‌తో సినిమా తీయాలనే శంకర్ సంకల్పం మాత్రం సాహసమైనదే!

-జె.ఎం.